క్లుప్తంగా

భద్రాద్రి రాముని సేవలో పేర్ని నాని దంపతులు



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య, జయసుధ దంపతులు సోమవారం భద్రాచలంలోని శ్రీ సీతారాముల ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజాలు నిర్వహించారు.

నేడు వి.కొత్తపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడూరు: మండలంలోని వి.కొత్తపాలెం సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పాండురంగారావు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఎంపీడీఓ చెప్పారు.

విద్యార్థులకు అభినందన



మచిలీపట్నంటౌన్: విజయవాడ రాజా ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన అబాకస్, వేదగణితం, రూబిక్ క్యూబ్ పోటీల్లో నగరానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో స్థానిక రాజా ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌లో శిక్షణ పొందిన 23 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, కన్సోలేషన్ బహుమతులు సాధించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, ఇస్రో సైంటిస్ట్ డి వివేకానంద బహుమతులు అందజేశారు. విద్యార్థులను సోమవారం స్థానిక పరాసుపేటలో జరిగిన అభినందన కార్యక్రమంలో సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గోపాలరాజా సత్కరించారు. రాజా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ లలితకుమారి పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి

బంటుమిల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రెజరీల ద్వారా కుటుంబ పెన్షన్ తీసుకునే వ్యక్తులు ట్రెజరీలో సీఎఫ్‌ఎంఎస్ ఖాతాకు ఆధార్, ఫోన్ నంబర్లు లింకుతో ఈకేవైసీ చేసుకోవాలని బంటుమిల్లి ఎస్‌టీవో కె.గోపీకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో ఉన్న పెన్షనర్లు ఈ నెల 10వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

వైభవంగా తిరుమంజనసేవ

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. రెండో రోజైన సోమవారం స్వామివారి ఉత్సవ మూర్తులకు తిరుమంజనసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో వేద పండితులు స్వామివార్లకు నవవిధ అభిషేకాలను నిర్వహించారు. శ్రీమన్నారాయణుడి 11 అడుగుల ఏకశిలా మూలమూర్తికి తులసీదళాలు, వివిధ రకాల పుష్పాలు, అభరణాలతో అలంకరించారు. ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించి, గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మంగళవారం నవకలస్నాపన, స్వామివారిని పెండికుమారుడిగా, అమ్మవార్లను పెండికుమార్తెలుగా అలంకరించనున్నట్లు అష్టాక్షరీ స్వామిజీ తెలిపారు.

భావన్నారాయణస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలో అత్యంత ప్రాచీన చారిత్రిక ప్రసిద్ధిగల శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణస్వామి కల్యాణోత్సవాలు 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య, భోగాది లోకేశ్వరరావు, విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు చెప్పారు. సోమవారం ఉదయం స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేశారు. సాయంత్రం విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాకీవరచనము, ముత్యం గ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉత్సవాలపై ఈఓ మాట్లాడుతూ మంగళవారం హోమాలు, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ 3న నిత్యహోమం, జగజ్యోతి, 4న రాత్రి ఎదుర్కోలు ఉత్సవం అనంతరం కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. 5న రథోత్సవం, మహా అన్నసమారాధన, 6న ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 2వ తేదీ రాత్రి మురళీ కోలాటం, 3న రాత్రి అవనిగడ్డలోని అర్చన నృత్యాలయం విద్యార్థులచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతాయని చెప్పారు.

వాడవాడలా మేడే వేడుకలు

- ర్యాలీలు నిర్వహించిన కార్మికులు
- పలు సంఘాల ఆధ్వర్యంలో పతాకాల ఆవిష్కరణ

కోనేరుసెంటర్: మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లో వాడవాడలా మేడే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మికులు, నేతలు ర్యాలీలు చేపట్టి పతాకాలను ఆవిష్కరించారు. మచిలీపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మేడే వేడుకలను పార్టీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ట్రేడ్ యూనియన్ నాయకులు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బందరు నియోజకవర్గం ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గోని గాంధీ మాట్లాడుతూ.. చికాగో కార్మికుల బలిదానం ప్రపంచ కార్మికులను ఐక్యం చేస్తే భారతదేశంలో కోట్లాది మంది ఉద్యోగ, కార్మిక, కర్షక వర్గాల వారి హక్కులను రాజ్యాంగం ద్వారా కల్పించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని అన్నారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు మాట్లాడుతూ భారతదేశంలో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించి మొదటి ఎన్నికల్లో 15 మంది ఎమ్మెల్యేలను గెలిపించి బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడి కార్మికుల హక్కులను సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిటికెన నాగేశ్వరరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అనుబంధ సంఘాల నాయకులు పిండి శ్యామ్ బాబు, ఆటో పాండు, నాగేశ్వరరావు, రామ్‌ప్రసాద్, బి.రవి, బురగ రామారావు, గాజుల నాగరాజు పాల్గొన్నారు.

పెడనలో వేడుకలు

పెడన: కార్మికుల ఐక్యత వర్ధిల్లాలంటూ కార్మికులు గళమెత్తారు. బ్రహ్మపురంలోని వివేకానంద పార్కు వద్ద మాజీ వైస్ చైర్మన్ బళ్ల గురున్నాథం, బంగ్లాసూకలు వద్ద పైడమ్మ తల్లి హామాలీ రిక్షా ఫ్లాట్‌ఫామ్స్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో నూతనంగా స్థూపావిష్కరణ చేసి మేడే జెండాలను ఆవిష్కరించారు. మిఠాయిలను, ఎర్ర టవల్స్‌ను పంపిణీ చేశారు. బస్టాండ్ సెంటర్, శ్రీకృష్ణ తులసీ సినిమా థియేటర్ ప్రాంతాల్లో వేడుకలను నిర్వహించారు. ఆయా స్థూపాల వద్ద సీపీఐ నాయకుడు కట్టా హేమసుందరరావు, తుమ్మ చినకొండయ్య తదితరులు జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మహమ్మద్ ఇసాక్, అబ్దుల్లి, బూసం బాలసుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వరరావు, లక్ష్మీ, ప్రసాద్, శ్రీను, భాస్కరరావు పాల్గొన్నారు.

కార్మికులు సంఘటిత శక్తిగా ఎదగాలి

నాగాయలంక: సీఐటీయూ, స్థానిక భగత్ సింగ్ ఆటో కార్మికుల యూనియన్, అంబేడ్కర్ రిక్షాకార్మికుల సంఘం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా మేడే వేడుకలను నిర్వహించారు. నాగాయలంక ప్రధాన సెంటర్‌లో ఆటో యూనియన్, అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో రిక్షా కార్మికుల నేతృత్వంలో జరిగిన కార్యక్రమాల్లో కార్మిక సంఘాల అరుణ పతాకాలను స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, రెడ్‌క్రాస్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్ ఎగురవేసి సందేశం ఇచ్చారు. ఎస్.ఐ మాట్లాడుతూ.. అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులంతా సంఘటితంగా తమ హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తూనే సమాజహిత సేవా కార్యక్రమాల్లో సైతం పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.నందు పాల్గొన్నారు.

అమర వీరులకు జోహార్లు

మోపిదేవి: కార్మిక పోరాటాలను కేంద్రప్రభుత్వం అణచివేస్తోందని సీఐటీయూ మండల కమిటీ అధ్యక్షుడు చిరివెళ్ల రాజశేఖర్ విమర్శించారు. మేడే సందర్భంగా సోమవారం మోపిదేవి ప్రధానసెంటర్‌లో జెండా ఆవిష్కరించి అమరవీరులకు జోహార్లు అర్పించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్, రిక్షా యూనియన్, పంచాయతీ కార్మికులు వేర్వేరుగా నిర్వహించారు. ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, రగేష్, కర్రా కోటేశ్వరరావు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులు



బంగ్లాస్కూల్ వద్ద వేడుకల్లో పాల్గొన్న కార్మికులు, నాయకులు



నాగాయలంకలో జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం, శివవిష్ణు



మోపిదేవి సెంటర్‌లో జెండా ఆవిష్కరించిన ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు

ఆకట్టుకున్న మేడే రంగవల్లులు

అవనిగడ్డ: ఆర్టీసీ డిపో వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో నాయకులు మేడే పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక బస్టాండ్ ఎదురుగా, టీటీడీ కల్యాణ మండపం, పార్కు, సీతాయమ్మ హోటల్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా టీటీడీ కల్యాణ మండపం వద్ద వేసిన మేడే ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోడూరులో జెండా ఆవిష్కరణ

కోడూరు: స్థానిక సంతమార్కెట్ రోడ్డులో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికుల జెండాను జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు ఆవిష్కరించారు. రైతు సంఘాల పర్యవేక్షణలో సాలెంపాలెం, హరిపురం, ఉల్లిపాలెం, శ్రీరామపురం, దింటిమెరక గ్రామాల్లో మేడే వేడుకలను నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్‌లో మేడే వేడుకలను నిర్వహించారు. విశ్వనాథపల్లిలో వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణ జెండాను ఆవిష్కరించారు. సీపీఎం, భవన నిర్మాణ సంఘం, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: సీఐటీయూ ఆధ్వర్యంలో ముఠా, బిల్డింగ్ వర్కర్స్ సీపీఎం ఆఫీస్‌తో పాటు పలు కూడళ్ల వద్ద కార్మిక జెండాలను ఆవిష్కరించారు. మోటారు సైకిల్ వర్కర్స్ అండ్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక విజయగణపతి ఆలయం వద్ద, ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద జెండాలను ఎగురవేశారు. అంతకు ముందు ర్యాలీలు నిర్వహించారు. సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు ఎం.శ్రీనివాసరావు, పి.ధనశ్రీ, జి.నాగేశ్వరరావు, ఎల్.అజయ్‌ఘోష్, పి.వెంకటేశ్వరరావు, ఏ.వెంకటేశ్వరరావు, కె.రవి, జి.శ్రీనివాసరావు, బాజీ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, డానీ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కార్యాలయంలో..

చల్లపల్లి: విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. విశ్రాంత లైన్‌మెన్ చావల రూబేన్‌బాబు మేడే పతాకం ఆవిష్కరించారు. బీటీఏ రాష్ట్ర అధ్యక్షులు కైతేపల్లి దాస్, ఏఐఎఫ్‌టీయు నాయకులు చాట్రగడ్డ సుధీర్, లైన్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. చల్లపలి బస్టాండ్ వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరిముల్లా ఆధ్వర్యంల వేడుకలు నిర్వహించారు. 300 మంది ఆటో కార్మికులకు ఎర్ర కండువాలు పంపిణీ చేశారు. ప్రధాన కూడలిలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయం వద్ద నాయకులు బొందలపాటి వెంకటేశ్వరరావు, ముత్యాల రామకృష్ణ వేడుకలు నిర్వహించారు. కోమలానగర్ బస్టాప్ సెంటరులో ఆటో కార్మికులు, గ్రామ సచివాలయం–1 సెంటరులో టాక్సీ కార్మికులు వేడుకలు జరిపారు.

గూడూరు: మండల కేంద్రమైన గూడూరులో సీఐటీయూ నాయకులు అరుణపతాకాన్ని ఎగురవేశారు. పోలవరంలో కమ్యూనిస్ట్ నాయకులు ఎర్ర జెండాలు చేతబట్టి ప్రదర్శన నిర్వహించారు. కప్పలదొడ్డిలోనూ వేడుకలు ఘనంగా జరిగాయి.



అవనిగడ్డ ఆర్టీసీ డిపో వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేడుకలు



బంటుమిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు



మచిలీపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన ఏఐటీయూసీ నాయకులు



మచిలీపట్నంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు

రెపరెపలాడిన అరుణ పతాకాలు

మచిలీపట్నంటౌన్: నగరంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్, సీఐటీయూ, ఏఐటీయూసీ వంటి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆయా సంఘాల స్థూపాల వద్ద అరుణ పతాకాలను ఎగురవేశారు. ఆటో, ముఠా, రిక్షా, ఎల్ఐసీ, బెల్, పోస్టల్, మునిసిపల్, ఆర్టీసీ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తదితర రంగాలకు చెందిన ఉద్యోగ కార్మికులు ఆయా సంస్థల వద్ద అరుణ పతాకాలను ఎగురవేశారు. జిల్లా సర్వజన ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద అరుణ పతాకాలను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ల స్వర్ణలత, ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్లు ఎస్.చంద్రశేఖర్, బి.శ్రీనివాసరావు, హెచ్‌వోడీ శివయ్య, ఆర్ఎంవో పోలా రామచంద్రరావు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నాయకులు బెల్లంకొండ కోటేశ్వరరావు, లింగం ఫిలిప్, కె.అజయ్‌కుమార్, అంజనీకుమార్, రాజేష్, లక్ష్మణరావు, కుమారి పాల్గొన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఐసీటీయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్, టి.చంద్రపాల్ పాల్గొన్నారు. సీపీఎం కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహారావు జెండాను ఎగురవేశారు. నాయకులు కొడాలి శర్మ, బూర సుబ్రహ్మణ్యం, జయరావు పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, నాయకులు లింగం ఫిలిప్, కరపాటి సత్యం, ఈశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జోరువానలోనూ పింఛన్ల పంపిణీ

కృత్తివెన్ను: ఎండైనా, వానైనా జగనన్న సంక్షేమ ఫలాలను గడప గడపకు అందించడమే వారి లక్ష్యం. దేశంలో ఎక్కడా లేని విధంగా వేకువజామునే ప్రతి ఇంటికీ వెళ్లి సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టింది మన రాష్ట్ర ప్రభుత్వం. ప్రతి నెలా ఒకటో తేదీన మహాయజ్ఞంలా సాగుతున్న ఈ కార్యక్రమం సోమవారం ఉదయాన్నే యథావిధిగా మొదలైంది. కృత్తివెన్ను మండలంలో తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తున్నా వలంటీర్లు జోరువానను సైతం లెక్కచేయక వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో పాటు ఇతర ఫించనర్లను పంపిణీ చేయడం జగనన్న ప్రభుత్వంపై మరిన్ని ప్రశంసలు కురుస్తున్నాయి.

పెడన: పట్టణంతో పాటు మండలంలో వైఎస్సార్ పింఛను లబ్ధిదారులకు వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి అందజేశారు. సోమవారం ఉదయం వర్షం కుండపోతగా పడినా లెక్కచేయకుండా వలంటీర్లు తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించారు. వీరితో పాటు గృహ సారథులు, పార్టీ నాయకులు సైతం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. పట్టణంలో 4,513 మంది పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులుంటే వీరిలో 3,877 మందికి మొదటి రోజున అందజేశారు. 85.81 శాతం పూర్తి చేశారు. మండలంలో 5,635 మందికి 4,652 మందికి సుమారు రూ.1,24 కోట్లను అందించారు.

90 శాతానికి పైగా పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో జోరు వర్షంలోనూ వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తున్నా పింఛనుదారుల తలుపుతట్టి పింఛను సొమ్మును అందజేశారు. నగరంలో 18,588 మంది పింఛనుదారులు ఉండగా వీరిలో సోమవారం సాయంత్రం వరకు 16,830 మందికి పింఛన్లు అందజేసి 90.54 శాతం పూర్తి చేశారు. జిల్లాలో పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగరంలో రెండో స్థానంలో నిలిచింది.



పెడన పట్టణం 16వ వార్డులో వర్షంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్, పార్టీ నాయకులు



మచిలీపట్నం 36వ డివిజన్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న చెన్నకేశవరావు, కేశవరావు

ఘనంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి

అవనిగడ్డ: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవీసేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సీఐ శ్రీనివాస్, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, అన్నపరెడ్డి రాందాస్, గార్లపాటి గోపీ, విస్సంశెట్టి నవీన్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. వేడుకలను ఆర్యవైశ్య సంఘం నేతలు, వాసవీ సేవాసంస్థ ప్రతినిధులు పర్యవేక్షించారు.



ఆర్యవైశ్య సంఘం నేతలతో ఎమ్మెల్యే సింహాద్రి

కుండపోత వర్షంతో అవస్థలు

అవనిగడ్డ/కృత్తివెన్ను: అవనిగడ్డ, కృత్తివెన్నుల్లో కుండపోత వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజాము నుంచి కురిసిన కుండపోత వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిలో భారీగా నీరు నిలిచింది. ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోవడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. కొన్నిచోట్ల అరటిచెట్లు నేలకొరడంతో రైతులకు నష్టం కలిగింది. నాగాయలంక, కోడూరు మండలాల్లో కుప్ప నూర్పిళ్లు జరిగి పంట పొలాల్లో ఉన్న వరిపంట నీట మునగడంతో ధాన్యం తడిచింది.

జొన్నను వదలని వర్షం

మోపిదేవి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట తడిసి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోయారు. మండల పరిధిలో మొత్తం 584 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, అందులో సగానికి పైగా మిషన్‌తో కోయించి, పంట కల్లాల్లోనే నిలిచిపోయాయని విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



అవనిగడ్డలో నీట మునిగిన ప్రధాన రహదారి



మోపిదేవిలో నేలకొరిగిన మొక్కజొన్న

జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు

నడకుదురు(చల్లపల్లి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు వేగవంతంగా కల్పిస్తున్నామని నడకుదురు సర్పంచ్ గొరిపర్తి సురేష్‌బాబు అన్నారు. నాదెళ్లవారిపాలెంలోని జగనన్న కాలనీలో విద్యుద్దీకరణ పనులు పూర్తి కాగా, గృహాలకు, కాలనీలో గ్రామ పంచాయతీ స్ట్రీట్ లైట్లకు సోమవారం విద్యుత్ సరఫరాను సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

15లోగా గృహనిర్మాణాలు ప్రారంభించాలి

గూడూరు: గృహనిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులతో ఈనెల 15వ తేదీలోగా బేస్‌మెంట్లు వేయించేలా క్షేత్రస్థాయి సిబ్బంది చొరవ తీసుకోవాలని గూడూరు ఎంపీడీవో డి.సుబ్బారావు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, బుక్ కీపర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులతో ఎంపీడీవో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఇళ్లు మంజూరై నిర్మాణాలు చేపట్టని వారిలో చైతన్యం తీసుకువచ్చి ఈ నెల 15లోగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా కృషి చేయాలని కోరారు.

కార్మికులకు వస్త్రాల పంపిణీ

చల్లపల్లి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజయ ఆయిల్ కంపెనీ నిర్వాహకులు దింటకుర్తి శ్రీరంగనాయకులు(రంగారావు) ఆర్థిక సాయంతో స్థానిక గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రదానం చేశారు. సోమవారం గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, క్లబ్ అధ్యక్షులు నూతక్కి శివబాబు, దాత దింటకుర్తి రవి వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పడమట సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు సభ విజయవంతానికి పిలుపు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం వాసుల చిరకాల వాంఛ అయిన పోర్టు నిర్మాణ పనులు ప్రారంభ సభకు నగర ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ పిలుపునిచ్చారు. ఈ నెల 22వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం విచ్చేసి పోర్టు పనులను ప్రారంభించి బహిరంగసభలో ప్రసంగిస్తారన్నారు. సీఎం జగన్ సముద్ర తీరాన పూజలు చేసి, నగరంలో బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. కార్పొరేటర్లు, పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పని చేస్తూ డివిజన్లలోని ప్రతి గృహానికి వెళ్లి పోర్టు పనుల ప్రారంభ సభకు ప్రజలను ఆహ్వానించాలన్నారు. నగరంలోని 36, 45, 49 డివిజన్లలో కన్వీనర్ గూడవల్లి నాగరాజు సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో కార్పొరేటర్ మాచవరపు రామ్‌ప్రసాద్, కోఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ గాంధీ, సచివాలయ కన్వీనర్ దార్ల చెన్నకేశవరావు, కార్పొరేటర్లు, పల్లి శేఖర్, మేకల సుబ్బన్న, చిటికిన నాగేశ్వరరావు, డివిజన్ పార్టీ ఇన్‌చార్జి ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర కన్వీనర్ నాగరాజు, పక్కన కార్పొరేటర్ రామ్‌ప్రసాద్

కమనీయం.. గోకర్ణేశ్వరుడి కల్యాణోత్సవం

కోడూరు: దివిసీమలో ప్రసిద్ధిగాంచిన లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణ మధ్య సోమవారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. ప్రత్యేక పల్లకిలో అమ్మవార్లను, నందీశ్వరుడిపై స్వామివారిని కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చి మచిలీపట్నంకు చెందిన పండితులచే కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కొత్తలంక జగన్నాథశర్మ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ సుధాకర్ స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేసి, జ్యోతిని వెలిగించారు. గర్భాలయంలోని గోకర్ణేశ్వరుడి మూలమూర్తికి రుద్రాభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు.



సామూహిక కుంకుమార్చన..

కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం బాలాత్రిపుర సుందరీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన, రాత్రికి రథోత్సవం ఉంటుందని ఈఓ సుధాకరరావు చెప్పారు. జేఏ సీహెచ్ శివప్రసాద్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించగా, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: స్థానిక కేంద్రీయ విద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరంలో 1వ తరగతి ప్రవేశానికి షెడ్యూల్డ్ ట్రైబ్(ఎస్టీ) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మార్చి 31వ తేదీ నాటికి ఆరేళ్లు పూర్తయి, ఎనిమిదేళ్ల కన్నా తక్కువ వయసు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులను పాఠశాల వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. మరిన్ని వివరాలకు 08672–231163 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గుడివాడ వారిచే ది. 22.4.2023న సాక్షి దినపత్రిక నందు ఇచ్చిన ప్రకటనలో ఋణగ్రహీత పేరును దేవనబోయిన కనకారావు గారి కుమారుడు ఆశీర్వాదం గారికి బదులుగా దేవనబోయిన కనకారావు గారి కుమారుడు జాన్‌బాబుగా చదువుకొనగలరు.
సంధ్రాజు రాంబాబు, అథరైజ్‌డ్ ఆఫీసర్, శ్రీరామ్ ఫైనాన్స్...